




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గుంటూరు పల్నాడు

మంగళవారం 8 జులై 2025 - పేజీలు 8


# ఇంజనీరింగ్ సీట్ల భర్తీలో ఆసక్తి



- అందుబాటులో ఉన్న సీట్లు 32,240
- ఎంసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు 23,536 మంది
- కళాశాలలో సీట్లన్నీ భర్తీ కానీ స్థితి



ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇంజనీరింగ్. సీట్ల భక్తిలో సర్వత్ర ఆసక్తి నెలకొంది. జిల్లాలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థుల్లో 23,536 మంది విద్యార్థులు ఈ ఏడాది ఎంసెట్లో తర్వాత సాధించారు. జిల్లా మొత్తం మీద 32,240 ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. సీట్లు ఎక్కువగా, అర్హత సాధించిన వారు తక్కువగా ఉన్నారు, దీనికి తోడు కొంతమంది విద్యార్థులు ఇప్పటికే ఇంజనీరింగ్ చదువుకునేందుకు పొరుగు రాష్ట్రాలకు రాష్ట్రం వెళ్లిపోయారు. దీంతో పలు కళాశాలల్లో ఉన్న ఇంజనీరింగ్ కోర్సు సీట్లన్నీ భర్తీ అయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ ఏపీ సెట్ కు ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి 33.,063 విద్యార్థులు హాజరైనట్లు తెలుస్తోంది.. దీనిని బట్టి అర్హత సాధించిన విద్యార్థులందరికీ ఇంజనీరింగ్ కౌన్సిలింగ్లో సీట్లు దక్కే అవకాశం ఉంది..

- పల్నాడు జిల్లా ప్రతినిధి, నేటి దినపత్రిక సూర్య

ఈ సంవత్సరం జిల్లాలో సీట్ల సంఖ్య అర్హత సాధించిన విద్యార్థుల కంటే ఎక్కువగా ఉండటం ఆసక్తికరంగా ఉంది. 2025 ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు, కౌన్సెలింగ్ షెడ్యూల్, ఇంజినీరింగ్ సీట్ల భర్తీ ప్రక్రియ విద్యార్థుల తల్లిదండ్రులలో ఉత్సాహాన్ని నింపుతోంది. ఏపీ ఈఏపీసెట్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 33,063 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 23,536 మంది అర్హత సాధించారు, అంటే 71.2 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఫలితాలు గత సంవత్సరాలతో పోలిస్తే జిల్లా విద్యా ప్రమాణాలలో స్థిరత్వాన్ని చూపిస్తున్నాయి. అర్హత సాధించిన ఈ విద్యార్థులు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా గుంటూరు జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల కోసం పోటీపడనున్నారు.

**సీట్ల లభ్యత**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్ యూ), జెఎన్టియు నరసరావుపేటతో సహా 34 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం కోసం 32,240 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్లలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సిఎస్సి), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసిఈ), మెకానికల్, సివిల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి బ్రాంచ్‌లు ఉన్నాయి. సిఎస్సి మరియు ఈసీఈ బ్రాంచ్‌లు విద్యార్థులలో అత్యంత డిమాండ్‌లో ఉన్నాయి, ఎందుకంటే ఈ రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.కౌన్సెలింగ్ షెడ్యూల్ మరియు ప్రక్రియఆదివారం విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం, జూలై 7 నుంచి 16 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల ఎంపిక జరుగనుంది. సీట్ల కేటాయింపు జూలై 22న ప్రకటించనున్నారు. రిజిస్ట్రేషన్ కోసం విద్యార్థులు వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. ఓసీ/బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు రూ.600 ప్రాసెసింగ్ ఫీజు

మిగతా 3వ పేజీలో







# ఆపరేషన్ సింధూర్ వీరుడు బలి

**పెదనందిపాడు, మేజర్ న్యూస్ :** రోడ్డు ప్రమాదం లో మృతి చెందిన ఆర్మీ సుబేధార్ ఉదయగిరి నాగేశ్వరావు ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గం, పెదనందిపాడు మండలం వరగాని గ్రామానికి చెందిన ఉదయగిరి నాగేశ్వరావు (44) గత 26 సంవత్సరాలుగా ఆర్మీ లో ఉద్యోగం చేస్తున్నారు. గత నెలలో జరిగిన ఆపరేషన్ సిందూర్ లో భాగంగా ఉగ్రవాదులు పై జరిపిన దాడుల్లో ముఖ్య పాత్ర పోషించారు, ఆపరేషన్ విజయవంతం కావడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఆంతా బాగున్నది అని స్వగ్రామం వచ్చే క్రమం లో రోడ్డు ప్రమాదం జరిగి, సరైన సమయంలో వైద్యం అందక, ప్రభుత్వ హాస్పిటల్ సిబ్బంది నిర్లక్ష్యం వలన అమరుడు అయ్యాడు. కుటుంబ సభ్యుల కదనం ప్రకారం గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గం, పెదనందిపాడు మండలం వరగాని గ్రామానికి చెందిన ఉదయగిరి నాగేశ్వరావు (44), గత 26 సంవత్సరాలుగా ఇండియన్ ఆర్మీ లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సుబేధార్ గా ఉద్యోగం చేస్తున్నారు, ఉద్యోగం రీత్యా ప్రస్తుతం రాజస్థాన్ లోని బికనీర్ 177 ఫెల్డ్ రీజిమెంట్ ఆర్టీ లో సుబేధార్ గా విధులు నిర్వహిస్తూ శనివారం రాత్రి స్వగ్రామం వరగాని కి కారు లో బయలుదేరారు. ఆదివారం రాత్రి తెలంగాణ రాష్ట్రము లోని నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని

మిగతా 3వ పేజీలో

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంపై ఆరోపణ
- వరగానికి చెందిన ఆర్మీ ఉద్యోగి మృతి
- ఆపరేషన్ సింధూర్‌లో పోరాడిన ఆర్మీ వీరుడు

# అక్రమ మైనింగ్ అరికట్టండి

## జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు



**నరసరావు పేట, మేజర్ న్యూస్ :** జిల్లాలో అక్రమ మైనింగ్ కార్యకలాపాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గ్రావెల్ తవ్వకాలపై అందుతున్న ఫిర్యాదులకు తక్షణమే స్పందించేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని రెవెన్యూ, మైనింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు నకిరేకల్ మండలంలో పర్యటించారు. పర్యటనలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా మండలం నుంచి రీ ఓపెన్ అయిన అర్జీలు, మ్యుటేషన్లు, రీ సర్వే, ఇళ్ల పట్టాల దరఖాస్తుల పరిశీలన, ఇళ్ల నిర్మాణాల రెగ్యులరైజేషన్, గ్రావెల్ అక్రమ తవ్వకాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో వీఆర్వోలు, సర్వేయర్లు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. సమస్యలు లేని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ఇళ్ల రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఆర్డీవో రమణా కాంత్ రెడ్డి, జిల్లా మైన్స్ మరియు జియాలజీ అధికారి నాగిని, సర్వే ఏడీ భానుకీర్తి, తహసీల్దార్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ అధికారులు అన్న క్యాంటీన్లను నిత్యం పర్యవేక్షించాలి

**నగర కమిషనర్ ఆదేశం**

**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్**




అన్నక్యాంటీన్లను నోడల్ అధికారులు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని, క్యాంటీన్లలో ఆహార సరఫరాకి నిర్దేశిత సమయాన్ని పాటించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం నల్లచెరువు మెయిన్ రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను నోడల్ అధికారులు ప్రతి రోజు పరిశీలించి, మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు నిర్దేశిత సమయంలో ఆహారం అందించేలా, క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అక్షయపాత్ర సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంటీన్లలో శుభ్రమైన త్రాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. క్యాంటీన్లలో ఆహార పదార్ధాల నాణ్యత, సూచనలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలియచేయవచ్చని, క్యూఆర్ కోడ్ పై క్యాంటీన్ కి వచ్చే వారికి తెలియచేయాలన్నారు.

### కారుణ్య నియామకాల ఉత్తర్వులు అందజేత

**గుంటూరు, మేజర్ న్యూస్ :** సోమవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కారుణ్య నియామకంలో భాగంగా దగ్గుమల్లి ఝాన్సీ రాణికి కార్మిక శాఖలో ఆఫీసు సబార్డినేట్ గా నియమిస్తూ జారీ చేసిన కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజతో కలసి అందించారు. నిబంధనల మేరకు వారికి కేటాయించిన శాఖలలో డ్యూటీకి రిపోర్ట్ చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, డిఆర్ఓ ఎన్.ఎస్.కే.ఖాజావలి, ఆర్డీఓ శ్రీనివాస రావు, జెడ్పీ సిఇఓ జ్యోతిబాసు, పిడి హౌసింగ్, డిఆర్డిఏ ప్రసాద్, విజయలక్ష్మి, సిపిఓ శేషశ్రీ, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఉద్యానవన శాఖ అధికారి రవీంద్ర బాబు, డిఎఫ్ఓ హిమ శైలజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర రావు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మీ, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏడి పవన్ కుమార్, డిడి అడల్ట్ ఎడ్యుకేషన్ ఆంజనేయులు, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్స్ స్కూల్స్ ప్రిన్సిపాల్ ఆనందబాబు పాల్గొన్నారు.

### త్వరలో నల్ల చెరువులోని అవుట్ ఫాల్ డ్రెయిన్, పూడిక తీత పనులు



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని నల్ల చెరువు రోడ్ లోని అవుట్ ఫాల్ డ్రెయిన్ పూడికతీత పనులు చేపట్టనున్నామని, డ్రెయిన్‌పై ఆక్రమణలను మంగళవారానికి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, ఇప్పటికే సచివాలయ కార్యదర్శుల ద్వారా సమాచారం ఇచ్చామని, తొలగించకోకుంటే జిఎంసి పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాల వలన డ్రెయిన్లు పొంగి మురుగు రోడ్ల మీదకు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజల నివాసాల్లోకి వెళ్లడం వలన పలు సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. నగరంలో ఇప్పటికే వార్డ్ ల వారీగా మేజర్, మైనర్ డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టామన్నారు. నల్లచెరువు రోడ్ లో ఎత్తు రోడ్ నుండి జాతీయ రహదారి వరకు చేపట్టనున్న పూడికతీత పనుల్లో భాగంగా డ్రెయిన్ల మీద ఇరువైపుల ఉన్న ఆక్రమణదారులు స్వచ్ఛందంగా మంగళవారం నాటికి తొలగించుకోవాలన్నారు. తొలగించుకోని ఆక్రమణలను జిఎంసి పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగిస్తారని, అందులో జరిగే నష్టానికి ఆక్రమణదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

## మార్గదర్శకాలను పాటించండి - జిల్లాలో అక్షరాస్యతను పెంచాలి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

వయోజన (15-59 సంవత్సరాలు) నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ - అక్షర ఆంధ్ర కార్యక్రమంను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో నిర్దేశించిన ఫలితాలు సాధించేలా క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ అధ్యక్షతన సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యాసనం, అవగాహన (ఉల్లాస్) జిల్లా స్థాయి కమిటీ కన్వర్జెన్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఉల్లాస్ - అక్షర ఆంధ్ర (సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాసనం, అవగాహన) అనే కార్యక్రమం ద్వారా సమాజంలో ఉన్న అక్షరాస్యులు కాని వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో ఈ నూతన పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 80 లక్షల మంది నిరక్షరాస్యులు వున్నారని, జిల్లాలో 2025-26 సంవత్సరానికి గాను 90,426 మంది నిరక్షరాస్యులను 2029 నాటికి వంద శాతం వయోజన ( ప్రాథమిక )



క్రియాత్మక సాక్షారతను సాధించే విధంగా లక్ష్యం రూపొందించడం జరిగిందన్నారు. ఉల్లాస్ యొక్క ముఖ్య లక్ష్యాలు ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన మరియు కుటుంబ సంక్షేమంతో పాటు తదితర జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమేనని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎంపీడీవో అధ్యక్షతన మండల స్థాయిలో, మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన మున్సిపల్ స్థాయిలలో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లోను, అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలలో ఆయాలు, వాచ్ మెన్, కుక్ సర్వే చేసి వీరిలో నిరక్షరాస్యులైన వారిని నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి శిక్షణలు పూర్తి చేసి తరగతులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తరగతుల నిర్వహణకు పాఠశాలలోను, ప్రభుత్వ కార్యాలయాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో అనుకూలమైన గదులను గుర్తించాలన్నారు. నిరక్షరాస్యులకు ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు రెండు గంటలు చొప్పున వంద గంటలు బోధన నిర్వహించాలన్నారు. 2024 అక్టోబర్ మాసం నుండి ఉల్లాస్ - అక్షర ఆంధ్ర కార్యక్రమం రాష్ట్రంలో అమలులోకి వచ్చిందన్నారు. జిల్లాలో 2024-25 సంవత్సరానికి 6,887 మంది వయోజనులు నమోదు కాబడి 23 మార్చి 2025 న వయోజన విద్య శాఖ మరియు నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన ప్రాథమిక అక్షరాస్యత మదింపు పరీక్ష నందు 6333 మంది ఉత్తీర్ణత సాధించి సర్టిఫికేట్స్ పొందియున్నారన్నారు. 2025 లో నమోదు కాబడే వయోజనులకు 2026 మార్చిలో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్స్ అందించడం జరుగుతుం దన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, డిఆర్ఓ ఎన్.ఎస్.కే. ఖాజావలి, ఆర్డీఓ శ్రీనివాస రావు, జెడ్పీ సిఇఓ జ్యోతిబాసు, డిడి అడల్ట్ ఎడ్యుకేషన్ ఆంజనేయులు, పిడి హౌసింగ్, డిఆర్డిఏ ప్రసాద్, విజయలక్ష్మి, సిపిఓ శేషశ్రీ, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఉద్యానవన శాఖ అధికారి రవీంద్ర బాబు, డిఎఫ్ఓ హిమ శైలజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర రావు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మీ, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏడి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుదాం

**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్**

గుంటూరు నగరాన్ని సుందర, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుకోవడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్స్‌ని భాగస్వాములను చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై స్టేక్ హోల్డర్స్, వెండింగ్ కమిటి సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రానున్న కాలంలో గుంటూరు నగరాన్ని పర్యావరణహిత నగరంగా తీర్చి దిద్దుకోవడానికి నగరంలో విస్తృతంగా మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టామని తెలిపారు. వార్డ్ల వారీగా కార్పొరేటర్లు ద్వారా మొక్కల పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే నగరంలో రోడ్లు, డ్రైన్లను ఆక్రమణ చేసుకొని ట్రాఫిక్, పారిశుధ్యానికి ఆటంకంగా ఉన్న వీధి వ్యాపారులకు త్వరలో వెండింగ్ జోన్ల ఏర్పాటు చేస్తామని, అనంతరం ఆయా ఆక్రమణలను



తొలగించే చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. అనధికార నిర్మాణాలు, పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు. స్టేక్ హోల్డర్స్, సీనియర్ సిటిజన్స్, ప్రజా ప్రతినిధుల సూచనలు, సలహాల మేరకు త్వరలో నగర సుందరీకరణ, అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ మాట్లా డుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఈ సీజన్‌లో దశలవారీగా 5లక్షల మొక్కలను నాటి సంరక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే వార్డ్ల వారీగా మొక్కలు నాటే ప్రక్రియ జరుగుతు దన్నారు. నాటిన మొక్కలను సంరక్షించడానికి

### నగరం మేయర్ రవీంద్ర పిలుపు

జిఎంసితో పాటు నగరంలోని ప్రముఖ సంస్థలు ముందుకు రావాలని కోరారు. అలాగే నగరంలో ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉన్న వీధి వ్యాపారులను చట్ట ప్రకారం వారి హక్కులకు భంగం కల్గకుండా క్రమబద్ధీకరణ చేస్తూ 2 ప్రాంతాల్లో వెండింగ్ జోన్ల ఏర్పాటు చేశామన్నారు. జోన్లలో వ్యాపారులకు నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించని వారికి గుర్తింపు కార్డ్‌లు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. నగర వెండింగ్ కమిటి నేతృత్వంలో గుర్తించిన మరి కొన్ని ప్రాంతాల్లో జోన్ల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై స్టేక్ హోల్డర్స్, రేట్ పేయర్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పలు సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఏడిహెచ్ జె.శాంతి, ఎంహెచ్ఓ (ఇంచార్జ్) రామారావు, స్టేక్ హోల్డర్స్, రేట్ పేయర్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# టెక్నాలజీతో జీరో క్రైమ్ రేట్ సాధించాలి

- క్రైమ్ హాట్ స్పాట్స్‌పై సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- పిడుగులు పడే ప్రదేశంలో ముందుగానే సైరన్ హెచ్చరికలు
- ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ
- రియల్ టైమ్ గవర్నెన్స్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** టెక్నాలజీని వినియోగించుకుని జీరో క్రైమ్ రేట్ స్టేట్ గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. సాంకేతికత వినియోగించుకుని శాంతి భద్రతల పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ ను ఓ మోడల్ రాష్ట్రంగా మార్చాలని స్పష్టం చేశారు. సోమవారం ఏపీ సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సుపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీసీ కెమెరాలతో క్రైమ్ హాట్ స్పాట్లపై నిరంతరం నిఘా పెట్టి నేరాల నియంత్రణ చేయాలన్నారు. దీంతో పాటు ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజ్ వ్యవహారంలోనూ నిబంధనలు మార్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నేరాల నియంత్రణకు ప్రైవేటు కెమెరాలను కూడా వినియోగించుకునేలా చూడాలని స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి విషయంలో టెక్నాలజీని మరింతగా ఉపయోగించుకోవాలన్నారు. కొందరు తెలివిగా నేరాలు చేసి.. దాన్ని ప్రభుత్వంపై నెడుతున్నారని.. పోలీసులకు సహకరించని వ్యక్తులు, నేతల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. ఇలాంటి వారి కోసం పబ్లిక్ సేఫ్టీ యాక్టు కింద వారి వద్ద నుంచి డేటాను తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయా నేరాలకు బాధ్యులుగా చేసే అంశంపైనా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజా భద్రత కోసం.. నేరాల కట్టడి కోసం.. దర్యాప్తు నిమిత్తం.. షాపింగ్ మాల్స్, థియేటర్లు, హోటళ్ల వద్ద ఉండే సీసీ కెమెరాల్లోని ఫుటేజీని సేకరించే వంటి వాటి విషయాల్లోనూ పబ్లిక్ సేఫ్టీ యాక్టును వర్తింప చేయాలన్నారు. మరోవైపు వివిధ రంగాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల వినియోగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ పురోగతిపైనా అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ**

వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన రికార్డులు, డేటా భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం రెవెన్యూ రికార్డులను కూడా పూర్తి స్థాయి ప్రక్షాళన చేసి నూతన సాంకేతికతనే వినియోగించి భద్రంగా ఉండేలా చూడాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారం డేటా లేక్ ద్వారా సమన్వయం చేయాలని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు 517 పౌరసేవల్ని వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందిస్తున్నట్టు అధికారులు వివరించారు.

# గడువులోగా ప్రజా సమస్యలు పరిష్కరించాలి

## గుంటూరు నగర కమిషనర్ ఆదేశం



**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్**

గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ లో ప్రజలు అందించే అర్జీలు, ఇతర సేవలు నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 30 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్ కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకొని కమిషనర్ గారు అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్ గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్జీలు బియండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లడానికి వీలులేదన్నారు. అలా వెళ్లిన విభాగ సూపరిండెంట్, సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అదనపు కమిషనర్ ని ఆదేశించారు. ప్రతి విభాగంలో పిజిఆర్ఎస్, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. అర్జీల పరిష్కారంపై జిఎంసి పిఎంయు బృందం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా పట్టణ ప్రణాళిక విభాగం 9, ఇంజినీరింగ్ విభాగం 17, రెవెన్యూ విభాగం 6, ప్రజారోగ్య విభాగం 3, ఉపా సెల్ విభాగం 2, అకౌంట్స్ విభాగానికి సంబందించి 2 ఫిర్యాదులు మొత్తం 39 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాల అమలు

## గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు సాధ్యమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గము 23వ డివిజన్ లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డివిజన్ లో పర్యటించి, ప్రజా సమస్యలు తెలుసుకొని, సంక్షేమ పథకాల అమలు గురించి వాకబు చేయగా ప్రజలు జగన్ ప్రభుత్వంలో కన్నా, ఎన్డీయే కూటమి పాలనలో రెట్టింపు సంక్షేమాన్ని పొందుతున్నామని హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా ఆటో డ్రైవర్ లను పలకరించగా గత ప్రభుత్వంలో గుంటల మయంగా మారిన గుంటూరు నేడు రోడ్లు వేయటం వలన ప్రయాణం సాఫీగా సాగుతుందని, ప్రమాదాలు కూడా తగ్గాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.... పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం, పెన్షన్ల పెంపుదల పై ప్రజల నుండి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తాన్నామని, అన్నదాత సుఖీభవ అమలు చేసి రైతులను ఆదుకుంటామన్నారు. అదేవిధంగా వడ్డెర సోదరుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, వారిని ఆర్థికంగా పైకి తీసుకొని రావటమే ధ్యేయంగా పనిచేస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరలను గుర్తించి వడ్డెర్ల ఆరాధ్య దైవమైన వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని జీవో విడుదల చేసిందని, బీసీల సంక్షేమానికి పెద్ద పీఠ వేసే ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో లామ్ వర్ధన్ రావు, గంటా మౌలిక, సాధు రాజేష్, మల్లె ఈశ్వర రావు, యాకోబు, నవమి, గోపి, గంధం చలపతి రావు, తోట సాంబశివరావు, సయ్యద్ ఇంతియాజ్, బాబు రావు, మస్తాన్ వలి, అబ్దుల్లా ఖాన్, పులి పృధ్వి, బుడే భాయ్, బంగారు బాబు, రత్న కుమారి, దిలవార్ షేక్, గంటా సాయి, మొవ్వ వేణు, కందునూరి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణ అక్షరాస్యత సాధ్యం : వల్లంరెడ్డి



**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ లో 1990వ దశాబ్దంలో సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమం ప్రజల భాగస్వామ్యంతో జరగటం వలన 1991 నుండి 2001 మద్య అక్షరాస్యత 17 శాతం పెరిగిందని, నేడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టబోయే అక్షరాంధ్ర ఉద్యమం ప్రజల భాగస్వామ్యంతో ప్రజా ఉద్యమంగా నిర్వహిస్తేనే సత్ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈనెల 7వ తేదీ సోమవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో మీడియా సమావేశంలో ప్రసంగించారు. 1990లో కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల సహకారంతో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో అధికార యంత్రాంగం, ఉపాధ్యాయులు, కళాకారులు, స్వచ్ఛంద సేవకులు, ప్రజా సంఘాల ఐక్య కృషితోనే ఆంధ్రప్రదేశ్ లో అక్షరాస్యత ఉద్యమం బలోపేతం అయిందన్నారు. ప్రతి 10మంది నిరాక్షం -స్యులకు ఒక విద్యావంతులైన స్వచ్ఛంద సేవకులు ఎలాంటి వేతనం తీసుకోకుండా, అక్షర కేంద్రాలలో నిరాక్షరాస్యులకు విద్యను అందించినాడని తెలిపారు. ప్రతి జిల్లాలో 40 వేల నుండి 50 వేల మంది స్వచ్ఛంద సేవకులు 4 లక్షల నుండి 5 లక్షల మందికి విద్యను బోధించినారని వివరించారు. వేలాదిమంది కళాకారులు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళారూపాల ద్వారా అక్షరాస్యత అవసరాన్ని తెలిపినా రన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ అక్షరాస్య తలో భారతదేశంలో అట్టడుగున ఉందని ప్రతి ముగ్గురులో ఒకరు తన మాతృభాషలో చదవడం, రాయటం లేని స్థితిలో ఉందన్నారు. 15 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయసులోపు వారు 81లక్షల మంది ఆంధ్రప్రదేశ్‌లో నిరాక్షరాస్యులుగా కొనసాగు తున్నారని తెలిపారు. ప్రాథమిక విద్య మాతృభాషలో లేకపోవడం, ఒకే ఉపాధ్యాయుడు వివిధ తరగతులను బోధించటం, పాఠశాలలు విలీనం లాంటి కారణాలతో ప్రతి సంవత్సరం లక్షమందికి పైగా బాల బాలికలు మధ్యలోనే బడి మానేసి నిరాక్ష రాస్యులుగా మారుతు న్నారన్నారు. భారతదేశంలో మిజోరం, లక్షదీప్, కేరళ, త్రిపుర, గోవా, నాగాలాండ్, మేఘాలయ, చండీఘర్, పాండిచ్చేరి, మణిపూర్ లాంటి రాష్ట్రాలు 90 శాతం పైగా అక్షరాస్యత కలిగి ఉంటే మరొక వైపు ఆంధ్రప్రదేశ్, బీహార్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్ లాంటి రాష్ట్రాలు 75శాతం లోపుగానే అక్షరాస్యత కలిగి ఉన్నాయన్నారు. ప్రపంచంలో సగటు అక్షరాస్యత 84 శాతం ఉంటే భారతదేశం 80 శాతంగా ఉంటూ అక్షరాస్యతలో ప్రపంచంలో 94వ స్థానంలో ఉందన్నారు. ప్రపంచంలో 70 దేశాలలో 99 శాతంపైగా అక్షరాస్యత ఉందని, మరో 50 దేశాలలో 90 శాతం అక్షరాస్యత ఉందన్నారు. ప్రపంచంలో ఉన్న ప్రతి ముగ్గురు నిరాక్షరాస్యులలో ఒక్కరు భారతీయు లుగా ఉండటం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టబోయే అక్షరాంధ్ర కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించకుండా అన్ని రాజకీయ పార్టీలను, యువజన, విద్యార్థి సంఘాలను, కళాకారులను, ఉపాధ్యాయులను, స్వచ్ఛంద సంస్థలను వినియోగించి ప్రజా ఉద్యమంగా నిర్వహిస్తేనే సత్ఫలితాలు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఇంజనీరింగ్ సీట్ల బర్తీలో ఆసక్తి

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఆధార్ కార్డ్, ఈఏపీసెట్ ర్యాంక్ కార్డ్, ఇంటర్మీడియట్ మార్కుల మెమో, కుల ధృవీకరణ పత్రం వంటివి సిద్ధంగా ఉంచుకోవాలి.

**సీట్లు ఎక్కువ పోటీ తక్కువ**

జిల్లాలో 23,536 మంది అర్హత సాధించిన విద్యార్థులతో పోలిస్తే 32,240 సీట్లు ఉండటం వల్ల సీటు దక్కే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. అయితే టాప్ ర్యాంకర్లు ఐఐటీలు, ఎన్ఐటిలు, ఐఐఐటీలు వంటి జాతీయ సంస్థలను లక్ష్యంగా చేసుకోవడం వల్ల రాష్ట్ర స్థాయి కళాశాలల్లో పోటీ కొంత తగ్గవచ్చు. అయినప్పటికీ ఏఎన్ యు, జేఎన్టీయూ నరసరావుపేట, ఇతర ప్రముఖ ప్రైవేట్ కళాశాలల్లో సిఎస్ఈ, ఈసీఈ బ్రాంచ్‌లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. గత సంవత్సరం డేటా ప్రకారం, గుంటూరులోని టాప్ కళాశాలల్లో సిఎస్ఈ సీట్ల కోసం 10,000వ ర్యాంక్‌లోపు ఉండాల్సి ఉంటుంది.

**విద్యార్థుల ప్రతిభ**

ఈఏపీసెట్ 2025లో గుంటూరు జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఉదాహరణకు నాళ్ల శాన్వీ సాయి వీర (67వ ర్యాంక్), కల్లూరి శ్రీ రాఘవ (46వ ర్యాంక్) జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కూడా మంచి ర్యాంకులతో ఐఐటీ లలో సీట్లు లక్ష్యంగా చేసుకున్నారు. ఇది జిల్లాలోని కోచింగ్ సెంటర్లు, పాఠశాలల నాణ్యతను సూచిస్తుంది.

**సవాళ్లు, సలహాలు**

విద్యార్థులు తమ ర్యాంక్, ఆసక్తి, కళాశాలల సౌకర్యాలు, ప్లేస్‌మెంట్ రికార్డ్‌ను పరిగణనలోకి తీసుకొని ఆప్షన్లు ఎంచుకోవాలి. ఆధార్, ర్యాంక్ కార్డ్, మార్కుల మెమో వంటి పత్రాలను ముందుగా సిద్ధం చేసుకోవాలి. ఓటిపిలను ఇతరులతో పంచుకోవద్దని అధికారులు హెచ్చరించారు. కళాశాలల ఫ్యాకల్టీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్లేస్‌మెంట్ రికార్డ్‌ను తనిఖీ చేయాల్సి ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇంజినీరింగ్ సీట్ల భర్తీ ప్రక్రియ విద్యార్థులకు గొప్ప అవకాశంగా నిలిచింది. సీట్ల సంఖ్య ఎక్కువగా ఉండటం, ప్రముఖ విశ్వవిద్యాలయాల ఉనికి, మరియు విద్యార్థుల ప్రతిభ కలిసి ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను ఆసక్తికరంగా మార్చాయి. సరైన ప్రణాళిక, సమాచారంతో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

# ఆపరేషన్ సింధూర్ వీరుడు బలి

(మొదటి పేజీ తరువాయి)

రాయానగూడ వద్ద రోడ్డు పక్కన వారు ప్రయాణిస్తున్న కారు అపి కలకృత్యాలు తీర్చుకుని మరల కారు స్ట్రార్ట్ చేసే క్రమంలో కారు స్ట్రార్ట్ కాకపోవడం తో పూర్తిగా సైడ్ కు పెడదామని కారు దిగి, కారు ను పక్కకు పెట్టె సమయంలో వెనుక నుండి అతి వేగంగా వచ్చిన కాంటైనర్ లారీ ఢీ కొట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ సమయంలో నాగేశ్వరావు తో పాటు అయన కుమారు డు వెంకట అభిషేక్(22), ఇద్దరినీ లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు ఆపాస్మరక స్థితిలోకి వెళ్ళారు. ఆ సమయంలో అటుగా వెళ్లే వాహనాలను అపి సహాయం చేయాలాని ఆర్మీ జవాను భార్య అనురాధ ప్రాధేయ పడినప్పటికి ఎవరు ముందుకు రాలేదు. 40 నిముషాల తరువాత అంబులెన్సు వచ్చింది అని, అంబులెన్సు లో నల్గొండ గవర్నమెంట్ హాస్పిటల్ కు తీసుకొని వెళ్ళమని, అక్కడ హాస్పిటల్ సిబ్బంది కనీసం ఎవరు స్పందించలేదని వారు సరైన సమయంలో వైద్యం అందించి ఉంటే తన భర్త, కుమారుడు బ్రతికే వారని, బ్రతికి ఉన్న వారిని చనిపోయారు అని చెప్పి హాస్పిటల్‌లో ఒక మూలకు నెట్టేసారు అని తెలంగాణ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం తెలంగాణ ప్రభుత్వం నిర్లాక్ష్య వైఖరి వల్లనే నా భర్త నాగేశ్వరావు, కుమారుడు వెంకట అభిషేక్ మరణించినట్లు ఆమె తెలిపారు. ఆర్మీ ఉద్యోగి మరణించిన విషయం తెలుసుకున్న గుంటూరు జిల్లా కేంద్రంలోని ఎన్‌సిసి హవల్దార్ మన్న, నాయక్ షేక్ రఫీలు మృతదేహన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి విశ్రాంత ఆర్మీ ఉద్యోగి టి.వెంకట సుబ్బారావు తదితరులు ఉన్నారు.

# 14న ఢిల్లీ వెళ్లనున్న సీఎం చంద్రబాబు

**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 14 (సోమవారం) సాయంత్రం దిల్లీకి పయనం కానున్నారు. కేంద్ర హెూం శాఖ, ఆర్థికశాఖ, జలశక్తి శాఖల మంత్రులను ప్రత్యేకంగా కలవనున్నారు. ఇతర శాఖల మంత్రులతోనూ భేటీ అయ్యే అవకాశం ఉంది.

# అమరావతిలో స్టార్ హోటళ్లకు భూముల కేటాయింపు

**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఏపీలో అమరావతి రాజధాని ప్రాంతంలో స్టార్ హెూటళ్లకు భూముల కేటాయింపుకు సి ఆర్ డి ఏ అథారిటీ ఆమోదం తెలిపింది. మందడంలో వివాంతా, హిల్టన్ హెూటల్స్, తుళ్లూరులో హయత్ రీజెన్సీ, లింగాయపాలెం నోవోటెల్ హెూటళ్లు, వాటి సమీపంలో ఈ కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి 2.5 ఎకరాల చొప్పున కేటాయిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది. క్వాలిటీ బేస్డ్ సెలెక్షన్ ప్రాతిపదికన ఈ కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి అథారిటీ ఆమోదం తెలియచేసింది.

## వైఎస్సార్ జయంతి వేడుకలను జయప్రదానికి పిలుపు




నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించాలని వైసీపీ రైతు విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి సోమవారం పిలుపునిచ్చారు. అలాగే పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలోని మండలాలకు నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులను నియమించడం శుభపరిణామం. నూతన సారథ్యంలో వైఎస్సార్ జయంతిని జరిపేందుకు సిద్ధం కావాలని కోరారు. అలాగే వారందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన చైర్మన్ రాధిక



తెనాలి, మేజర్ న్యూస్ :పట్టణంలోని మారిస్ పేటలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక సోమవారం పరిశీలించారు. 22వ వార్డులో ఆమె పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించి పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు. అభివృద్ధి పనుల నిర్వహణలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దుబాయ్ బాబు,మున్సిపల్ ప్రజారోగ్యశాఖఅధికారి డాక్టర్ మొవ్వా ఏసుబాబు, టీపీవో సాంబశివరావు, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిర్యాదులు చట్టపరిధిలోనే పరిష్కారం: ఎస్పీ



గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్:జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా ఫిర్యాదులు - పరిష్కారాల వ్యవస్థ కార్యక్రమం" నకు విచ్చేసిన ప్రజల వద్ద ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలకు చట్ట పరిధిలో తగిన పరిష్కారం చూపిస్తామని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ప్రజలతో పోలీస్ అధికారులు ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. అదనపు ఎస్పీ (క్రైమ్స్) కే.సుప్రజ, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు దారుల వద్దకు నేరుగా వెళ్లి వారి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్పీ గారితో పాటు అదనపు ఎస్పీ(అడ్మిన్) రమణమూర్తి, అదనపు ఎస్పీ(క్రైమ్స్) కే.సుప్రజ, అదనపు ఎస్పీ(ఏఆర్) ఏ.హనుమంతు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



తెనాలి, మేజర్ న్యూస్ :లేబర్ కోడ్ ల రద్దు కొరకు, కార్మిక హక్కుల రక్షణ కొరకు జూలై 9 జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎన్ భావన్నారాయణ పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సోమవారం మండలంలోని వివిధ రంగాల కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి నిర్మల జ్యోతి అధ్యక్షత వహించారు. భావనారాయణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు పనిగంటలు పెంచాయని, గత 12 సంవత్సరాలుగా కనీస వేతనాలు సవరించలేదని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కొల్లిపరలోని మండలంలోని కార్మిక వర్గం మొత్తం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు ములకా సాంబి రెడ్డి మాట్లాడుతూ జూలై 9 వ తేదీ ఉదయం 10 గంటలకు అంబేద్కర్ విగ్రహం నుంచి ఎమ్మార్వో ఆఫీస్ వరకు జరిగే ప్రదర్శనలో కార్మిక వర్గం మొత్తం క్రమశిక్షణతో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోటా చంద్రశేఖర్, గోదాసుందరరావు, రమేష్, సిహెచ్ సీతమ్మ, వసంత కుమారి, సంతోష్ కుమారి, ఎస్ కే జైన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాంగణ ఎంపికల్లో ఆర్ వి ఆర్ ప్రతిభ



గుంటూరు, మేజర్ న్యూస్: ఇటీవల తమ కళాశాలలో పలు కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 20 మంది విద్యార్థులకు 3 నుండి 6 లక్షల రూపాయల వరకు ప్యాకేజీతో కూడిన ఉద్యోగాలు లభించడం ఆనందదాయకమని, ఈ ఏడాది 2024-25 విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు 852 మంది విద్యార్థులకు, ప్రసిద్ధి చెందిన వివిధ కంపెనీల్లో, అధిక ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు లభించాయని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా.జగదీష్ కె. పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సోమవారం నాడు కళాశాల సిబ్బంది అభినందించారు. తమ కళాశాల విద్యార్థులకు మరుగైన విద్యాబోధనతో పాటూ, కంపెనీల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నిపుణులచే తగిన శిక్షణను అందించడం ద్వారా ఉద్యోగాల సాధన సులభతరమయ్యిందని, తమ కళాశాలలోని ఇంక్యూబేషన్, ఇన్నోవేషన్ సెంటర్ లు విద్యార్థులకు పరిశోధనల వైపు ప్రోత్సాహిస్తూ, నూతన ఆవిష్కరణలతో స్టార్టప్ లు నెలకొల్పేందుకు ఉపయోగపడుతున్నాయని కళాశాల సెక్రటరీ & కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ బెంగుళూరు కు చెందిన ఎక్సెల్ ఆర్ కంపెనీలో 9 మంది, ప్రిధిని ఇన్ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 7 మంది, ఎవరెస్ట్ ల్యాబ్ లో ఇద్దరు, బెటర్ క్యాస్టింగ్స్ కంపెనీలో ఇద్దరు, మొత్తం 20 మంది విద్యార్థులు ప్రాంగణాల నియామకాల్లో ఉద్యోగాలు సాధించారని, తమ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న కంప్యూటర్ కోర్స్ విద్యార్థులతో పాటుగా, కోర్ కోర్స్ లైన ఈ ఈ ఈ , మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజనీరింగ్ కోర్స్ విద్యార్థులకు కూడా అధిక ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ అండ్ ఆర్&డి డైరెక్టర్ డా.కె. రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ & అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి.శ్రీనివాసరావు, వివిధ శాఖల విభాగాధిపతులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారులు సి.హెచ్. శ్రీనివాసరావు, డా.కె. సురేష్ బాబు తదితరులు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

# మత్తు పదార్థాలతో జీవితం అంధకారం

## - ఈగల్ ఎస్పీ నగేష్ బాబు



గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు అంధకారం అవుతాయని ఈగల్ (నార్కోటిక్స్) ఎస్పీ, పాఠశాల పూర్వ విద్యార్థి నగేశ్ బాబు సూచించారు. గుంటూరు ఏటి అగ్రహారం ఎస్ కే బి. ఎం.మున్సిపల్ హై స్కూల్ లో సోమవారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభగల విద్యార్థులకు నగదు ప్రోత్సాహ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...విద్యుర్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారని వాటికి దూరంగా ఉండాలన్నారు. హైదరాబాద్ కు చెందిన ఒక సాఫ్ట్వేర్ ఉద్యోగి మత్తు పదార్థాలకు బానిసగా మారాడు. ఫలితంగా ప్రతినెల రూ. కోటికి పైగా జీతం తీసుకునే అతను ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చిందని ఉదాహరణగా చెప్పారు. చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎస్పీ వివరించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మోహనరావు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు వినయ విధేయతలు అలవర్చుకోవాలని తల్లిదండ్రులను పెద్దలను గౌరవించాలని సూచించారు. పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించటం కోసమే అల్యూమిని అసోసియేషన్ పేరుతో ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి శైలజ పేర్కొన్నారు. అనంతరం 6 నుండి 10 వ తరగతి లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సుమారు రూ.2 లక్షల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా సరే విద్యార్థి చేబ్రోలు శ్రీనివాసరావు పాఠశాలకు ఉదారంగా కంప్యూటర్ ను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అడకా పద్మావతి, అడకా శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజావలి , పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు బీఎల్ శైలజ, కోపూరి కోటేశ్వరరావు, శీలం శ్రీనివాస రావు, ఆళ్ల వీరభద్రరావు (భద్రం) మధు లాల్, హైమారావు, చెవుల శ్రీను, స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# సత్తెనపల్లి పోలీసులు అమాయకులు : పేర్ని నాని

సత్తెనపల్లి మేజర్ న్యూస్: సత్తెనపల్లి పోలీసు అమాయకులని అధికార పార్టీ నాయకులు తప్పుడు కేసులు పెట్టమంటే అధికార పార్టీకి భయపడి యస్పి డిఎస్పీ సీఐ వంటి ఉన్నతాధికారులు భయపడి కేసులు పెడుతున్నారన్నారు. సోమవారం సత్తెనపల్లి పోలీస్ స్టేషన్కు వైఎస్ఆర్సిపి మాజీమంత్రి నాని వచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ తో పర్యటనకు రావడం వల్ల నామీద కేసు నమోదు చేశారన్నారు. పోలీసులు నిన్న నా ఇంటికి నోటీసు అంటించి వెళ్ళిపోయారని తెలిపారు. 11 సెక్షన్లతో నామీద నేరం నమోదు చేశార,మాజీ ముఖ్యమంత్రి పర్యటనకు మూడు కార్లు 100 మందిలో నేను ఒక వ్యక్తిని, ఆయన నా మీద కూడా కేసు నమోదు చేశారని, పోలీసులు కేసు నమోదు చేయకపోతే బదిలీలు గాని సస్పెండ్ గాని చేస్తామని అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో సైకో పరిపాలన నరకాసుని పరిపాలన జరుగుతుందన్నారు. మహా అయితే బందర్ నుండి సత్తెనపల్లికి కేసులు పెట్టి తిప్పుతారని, ఎన్ని కేసులు అయినా పెట్టుకోండి జగన్ జెండా వదిలేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా...ఎంఆర్ పిఎస్ వ్యవస్థాపక దినోత్సవం



సత్తెనపల్లి మేజర్ న్యూస్:ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బాబు జగజ్జీవన్ రామ్ కార్యాలయం వద్ద జండావిష్కరణ జరిగింది. ఈ జండావిష్కరణను గరికపాటి రవి చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మాదిగ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసి, కృష్ణ అన్న సాధించటం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గర్నెపూడి సాల్మన్ రాజు, అమరావతి ఆటో స్టాండ్ సభ్యులు ఫాల్గొన్నారు.

## ఘనంగా ఏక లవ్యని జయంతి వేడుకలు



దుగ్గిరాల , మేజర్ న్యూస్ .దుగ్గిరాల రైలుపేట వంతెన వద్ద ఉన్న ఏకలవ్యని జయంతి వేడుకలు ఆదివాసి ఎరుకల సేవా సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గరిక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఏకలవ్యుని విగ్రహానికి పూలమాల లువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డి .శంకర్రావు ,కేశ 0నేని శ్రీ అనిత ,ఉన్నం ఝాన్సీ రాణి ,మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్, పీ. కరుణాకర్ ,డి. చం టి, నాయుడు బాబురావు ,తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను ఖండించండి

సత్తెనపల్లి మేజర్ న్యూస్: ఇటీవల గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, మన్నవ గ్రామ సర్పంచ్ నాగ మల్లేశ్వర రావు పై టిడిపి గూండాలు పట్టపగలు కొట్టి చంపే ప్రయత్నం చేయడం దారుణం, అమానుషమని వైకాపా బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది రాజారపు శివనాగేశ్వరరరావు. అన్నారు. రాష్ట్రంలో లా – అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించి%శీ%దని చెప్పడానికి ఈ సంఘటనే నిదర్శనమన్నారు. రెడ్ బుక్ పాలనలో రాష్ట్రంలో అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్నాయని, టిడిపి మూకల దాడిలో నాగ మల్లేశ్వరరావు ను కొట్టి తీవ్రంగా గాయపరిచారని టి.డి.పి అధికారములోనికి వచ్చిన తరువాత దళితులపైనా, పేద వర్గాల పైనా దాడులు ఎక్కువయ్యాయన్నారు. తెనాలిలో దళిత యువకులపై పోలీసులు నడి బజారులో కొట్టిన సంఘటన మరొక ఉదాహరణ అని, రాష్ట్రంలో దళితులంటే తెలుగుదేశం పార్టీకి చిన్న చూపని, గతంలో చంద్రబాబునాయుడు దళితులుగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా.. అని అవహేళన చేసారని గుర్తు చేశారు. గతంలో పల్లెకారులను, నాయీ బ్రాహ్మణులను తాట తీస్తా, తోలు తీస్తా అని దుర్భాషలాడి, వారిని ఆవమాన పరిచారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఆదినారాయణ రెడ్డి దళితులు మురికిగా ఉంటారని అవమాన పరిచారు. దెందులూరు యం.యల్ ఎ. చింతమనేని ప్రభాకర్ గతంలో దళితులను మీకెందుకురా రాజకీయాలు అని దళితులని అవమాన పరి చారని ఈ విధంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ మంత్రులు దళితులను అవమాన పరుస్తూ, వారిపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాలను ప్రజలు గమనిస్తూ ఉన్నారని, తెలుగు దేశం పార్టీ నాయకులు భవిష్యత్తులో దీనికి మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని ఇకపై దళితుల పై దాడులను మానుకోవాలని ఆయన కోరారు.



### సమస్య పరిష్కరించకపోతే

# ఈ నెల 12 నుండి నిరవధిక సమ్మె

### - యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు సిలార్ మసూద్




నరసరావుపేట మేజర్ న్యూస్ : వేతనాలు పెంచి దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గత 3 నెలలుగా శాంతియుతంగా అనేక విధాలుగా ఆందోళన కార్యక్రమాలు చేస్తూనే తమ యూనియన్ పెద్దల ద్వారా ప్రభుత్వానికి రాయబారం పంపినప్పటికీ కూటమి పెద్దలు స్పందించకపోవడం చుస్తే మున్సిపల్ కార్మికుల పట్ల వారి వైఖరి తేటతెల్లమవుతుందని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్. సిలార్ మసూద్ అన్నారు. ఈ మేరకు నరసరావుపేట పట్టణంలో సోమవారం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పురపాలక సంఘం కార్యాలయం వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం చుట్టూ మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిలార్ మసూద్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ పెద్దల దగ్గరకు తమ యూనియన్ నాయకులు వెళ్ళిన ప్రతిసారి సమ్మెలోకి వెళ్ళొద్దని చెప్పడం తప్ప నిర్దిష్టమైన హామీలు ఇవ్వడం లేదన్నారు. ఈనెల 4న విజయవాడలో నిర్వహించిన సమ్మె శంఖారావంలో మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించలేదని సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 12 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. నిత్యావసరాల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయని 11 ఏళ్ల నుండి కార్మికుల వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. కార్మికులు సమ్మెలోకి వెళితే ప్రజలకు కలిగే అసౌకర్యానికి ప్రభుత్వం, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కారణమన్నారు. తమ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బైక్ ర్యాలీలు, భిక్షాటన, అర్ధనగ్న ప్రదర్శనలు, పొర్లు దండాలు వంటి కార్యక్రమాల ద్వారా శాంతియుత నిరసన తెలుపుతామన్నారు. జీఓ నెం. 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని,గత సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కార్మికులపై అధికారుల, రాజకీయ వేధింపులు ఆపాలని పెరిగిన పట్టణీకరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ మట్టి ఖర్చులు సమ్మెకు ఒప్పందాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు చిన అల్లాబక్షు, సోమశేఖర్, సామ్రాజ్యం, నాగయ్య, మాలిక్, రంగా, బి.శ్రీను,కె.శ్రీను, సింగ్, నాగరాజు, సామ్రాజ్యం, నాగయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, వాసు, ఖాదర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### రేవేంద్రపాడు తెలుగుదేశం పార్టీ

# గ్రామ అధ్యక్షులు కురగంటి మల్లేశ్వరరావు నియామకం

దుగ్గిరాల, మేజర్ న్యూస్ .దుగ్గిరాల మండల పరిధిలోని. రేవేంద్రపాడు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులుగా కురగంటి మల్లేశ్వరరావు నియామకమయ్యారు .ఉపాధ్యక్షులు. గా షేక్ బాజీ, కార్యదర్శి ఇజ్జ గాని శంకర్ లు ఎంపికయ్యారు . ఊర బావి సెంటర్ నందు జరిగిన సమావేశంలో ఈ కమిటీ ఎంపికైంది. ముందుగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు . ఈ కార్యక్రమంలో. కేస 0 నేని శ్రీ అనిత ఎంపీపీ షేక్. జబీన్ , ఉన్నంఝాన్సీ రాణి ,నియోజకవర్గ తెలుగు రైతు నాయకులు వాసిరెడ్డిశ్రీనివాసరావు ,ఎంపీటీసీ కొప్పుల మధుబాబు ,కే .జస్వంత్ ,పార్టీ కార్యకర్తలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం

### - గుర్తు పట్టిన వారు కొత్తపేట పోలీసులు సంప్రదించండి

గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్: కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృత దేహం కనుగొన్నట్లు కొత్తపేట పోలీసులు సోమవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్ట్ గేటు వద్ద గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండటం గమనించిన సెక్యూరిటీ గార్డ్ రవికుమార్ కొత్తపేట పోలీసులకు సమాచారం తెలియజేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించి, మృతుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల వారిని విచారించి ఆచూకీ లభించకపోవడంతో మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారులు ధ్రువీకరించిన మేరకు మృత దేహాన్ని మార్చురీలో ఉంచినట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు. సుమారు (55) సంవత్సరాలు కలిగిన ఊరు పేరు చిరునామా తెలియని మగ వ్యక్తి మరణించినట్లు గుర్తించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు . మృత దేహము గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి నందు భద్రపరిచామని, సదరు మృతుడి ఆచూకీ గురించి సమాచారం తెలిసిన వెంటనే కొత్తపేట పోలీసు వారికి సమాచారం తెలిపి తీసుకువెళ్లవచ్చని కొత్తపేట పోలీసులు తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ ఫోన్ నెంబర్ : 8688831320 , 08632221815 నంబర్లకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## మెగా పేటీఎం 2 .0 కు ముస్తాబ్ అవుతున్న బాలికల పాఠశాల విద్యార్థులు








దుగ్గిరాల, మేజర్ న్యూస్ . ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న మెగా పిటిఎం 2 .0 ను నిర్వహించేందుకు దుగ్గిరాల బాలికొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. శోభా దేవి ఆధ్వర్యంలోవిద్యార్థు నులు ఎంపీటీ సి ఆకారంలో దర్శనమిస్తున్నారు. దుగ్గిరాల గ్రామంలోని బాలికోన్నత పాఠశాలలో నిర్వహించే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కు జిల్లా పరిషత్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థినులు ఎంపీటీఎమ్ ఆకారంలో ఒదిగి ఉండే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థునులను తీర్చిదిద్దారు. మెగా పిటిఎం వలన పిల్లల ప్రగతిని, పిల్లల ప్రయాణాన్ని కలిసి జరుపుకునే మెగా పండుగకు పాఠశాల ను సిద్ధం చేస్తున్నారు. పిల్లల విద్యార్థుల పురోగతి, విద్యార్థునులలో దాగి ఉన్న సృజనాత్మకత. తరగతిలోమార్పుకు తల్లిదండ్రు లుఉపాధ్యాయులు తో కలిసి ఆలోచించేఅవకాశాన్ని పిల్లల భవిష్యత్తుకోసం తీర్చిదిద్దే వినూత్నమైన అడుగుకు శ్రీకారం చుట్టనున్నారనీ హెచ్ఎం. ఎస్ . శోభా దేవి వివరించారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు రాకతో పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల పురోగతికి ఎంతో ఉపయోగపడుతుందనేది తేట తెల్లం కానున్నది .

# నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం దివ్వెల



సత్తెనపల్లి మేజర్ న్యూస్: పట్టణం లో ఆర్య వైశ్య సేవాసమితి కార్యవర్గం ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కళ్యాణ మండలంలో ఆర్య వైశ్య సేవాసమితి అధ్యక్షులు వెలుగూరి శరత్ బాబు ఆద్వర్యంలోభరతమాత అన్నప్రసాద వితరణ పథకం నిర్విఘ్నంగా 713 రోజులు దాతల సహకారంతో పూర్తి చేసిన సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు కు ఘన సన్మానం చేసారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దివ్వెల శ్రీనివాసరావు కరోనా మొదట మరియు రెండవ వేవ్ లో చేసిన సేవలు ,భరతమాత అన్నప్రసాద వితరణ పథకం ద్వారా నిరుపేదల ఆకలి తీర్చుతున్న విషయం చాలాగొప్పదిఅని,ఎంతో ఓర్పు , నిజాయితీ, పట్టుదలతో కూడిన నిరంతర శ్రమ వలననే సుదీర్ఘ కాలంగా ఈ పథకం కొనసాగించారు అని,వృత్తి రీత్యా న్యాయవాది అయినా దాతల సహకారంతో ఎన్నో సేవా కార్యక్రమాలను చేయటంలో ముందంజలో దివ్వెల ఉన్నాడు అని అన్నారు. దివ్వెల శ్రీనివాసరావు చేస్తున్న సేవలను ప్రభుత్వం కూడా గుర్తించి మంచి అవార్డు ఇవ్వాలి అని అన్నారు. దివ్వెల శ్రీనివాసరావు చేస్తున్న సేవలు ఖండాంతరాలకు వ్యాపించటము అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య చలివేంద్ర సంఘము నాయకులు,ఆర్య వైశ్య సేవా సమితి కార్యవర్గం, ఆర్య వైశ్య యువజన సంఘం నాయకులు,వాసవి క్లబ్ సభ్యులు మరియు ఆర్య వైశ్య పుర ప్రముఖులు పాల్గొన్నారు. చివరిలో జమిలి రాధా కృష్ణమూర్తి వందన సమర్పణ గావించారు.

# కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

### - ఏపి రైతు సంఘం పల్నాడు ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు

నరసరావుపేట మేజర్ న్యూస్ :కందులతో పాటు రబీలో రైతులు సాగు చేసిన అపరాలు ఇతర అన్ని పంటలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఏపి రైతు సంఘం పల్నాడు ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వేలాది ఎకరాలలో కంది సాగు చేశారని, వేల టన్నులు కందులు నిల్వ ఉన్నాయన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా నామమాత్రంగా కొనుగోళ్ళు చేసి కొనుగోళ్ల లక్ష్యం పూర్తయిందని కొనుగోలు ఆపడంతో కందుల నిల్వలు అలాగే ఉన్నాయన్నారు. నూజెండ్ల మండలం ములకలూరు గ్రామంలో 70 మంది రైతుల వద్ద 200 టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. రబీ ధాన్యం కొనుగోలు అంతంత మాత్రం గానే జరిగినా, కొనుగోలు చేసిన ధాన్యానికి ఖరీఫ్ ప్రారంభం అవుతున్నా నగదు రాక రైతులు నిరాశలో ఉన్నారని తక్షణమే రైతుల ఖాతాకు నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రైతుల దగ్గర ఉన్న అన్ని పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని నమ్మించి అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు పండించి తీరా పంట చేతికి వచ్చే సమయానికి




దళారులు ధరలు తగ్గించి రైతులను లూటీ చేస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నేరుగా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతులు చేసే ఆందోళనకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చేకూరి సురేష్, రాజారపు ముని వెంకటేశ్వర్లు, రైతులు ఏడుకొండలు, వెంకటరావు, అంజిబాబు, కావూరి వెంకటేశ్వర్లు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### - జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు




పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక,ఆస్తి తగాదాలు,మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 96 ఫిర్యాదులు అందాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు సత్తెనపల్లి మండలం నాగన్నకుంట కు చెందిన షేక్. తాహిరా కు 15 సంవత్సరముల క్రితం వివాహమైనట్లు, ఇప్పటివరకు సంతానం లేకపోవడం వలన ఫిర్యాది భర్త ఆయన షేక్ హుస్సేన్ రోజు త్రాగి వచ్చి వేధిస్తున్నట్లు మరియు చీటికిమాటికి కొడుతున్నట్లు, మీకు దిక్కున చోట చెప్పుకొని బెదిరిస్తూ దౌర్జన్యం చేస్తున్నట్లు, ఇదే అదునుగా చూసుకొని ఫిర్యాది అత్త మరియు ఆడబిడ్డ దురుసుగా ప్రవర్తిస్తున్నందుకు గాను ఫిర్యాది న్యాయం కొరకు ఎస్పీ ని కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందినటువంటి బలుసుపాటి కోటయ్య అను అతను ఆన్లైన్లో పరిచయమైనటువంటి గజ్జల మధుసూదన్ రెడ్డి మరియు రొంగల ప్రవీణ్ కుమార్ అను శ్రీకాకుళం జిల్లా పలాస నివాసులు ఫారెక్స్ వ్యాపారము చేస్తామని నమ్మించి, మీరు పెట్టే పెట్టుబడి పై ప్రతినెలా 10% లాభం ఇస్తామని పెట్టుబడికి ప్రేరేపించినట్లు, అందుకుగాను ఫిర్యాదు రొంగల ప్రవీణ్ కుమార్ కు 45,67,500/- పలు దఫాలు డబ్బులు పంపినట్లు, అయితే రొంగల ప్రవీణ్ కుమార్ లాభం ఇవ్వకుండా కాలయాపన చేస్తుండగా మోసపోయినట్లు గ్రహించి అసలు మొత్తం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నందుకు గాను తగిన న్యాయం కొరకు ఎస్పీ ని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది ఇస్తాము లేకపోతే ఇవ్వము అని, మీకు చేతనేంది మీరు చేసుకోండి అని దౌర్జన్యంగా మాట్లాడినట్లు కావున హెచ్.డి.బి బ్యాంకు మేనేజర్ గౌస్ మరియు కలెక్షన్ మేనేజర్ రవికిరణ్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని డాక్యుమెంట్లు ఇప్పించవలసిందిగా ఎస్పీ ని కలిసి ఇవ్వడం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహాయ సహకారాలు అందించారు. అదే విధంగా దూర ప్రాంతాల నుండి వచ్చే అర్జీదారుల కొరకు భోజన ఏర్పాట్లు చేశారు.

### దుర్గి మండలంలో సుపరిపాలనలో

## తొలి అడుగు ఇంటింటికి టిడిపి కార్యక్రమం



దుర్గి మేజర్ న్యూస్ : పల్నాడు జిల్లా దుర్గి మండలం పరిధిలోని కంచరగుంట మరియు కోలగుట్ల గ్రామంలోని నాయకులు,టిడిపి కార్య కర్తలు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపి అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరై.ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చినదగ్గరనుండి ఇచ్చిన హామీల వలన జరుగుతున్న అభివృద్ధి పనులను, అందిస్తున్న సంక్షేమం పథకాలు గురించి ప్రజలకు వివరించారు అలాగే మన నియోజకవర్గంలోని ప్రధాన సమస్య అయినటువంటి తాగు, సాగు నీరు ప్రాజెక్టుల పరిస్థితులు, భవిష్యత్తులో రాబోయే ప్రాజెక్టుల గురించి ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు.

### వైఎస్సార్ జయంతి వేడుకలను

## జయప్రదానికి పిలుపు



నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించాలని వైసీపీ రైతు విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి సోమవారం పిలుపునిచ్చారు. అలాగే పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలోని మండలాలకు నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులను నియమించడం శుభపరిణామం. నూతన సారథ్యంలో వైఎస్సార్ జయంతిని జరిపేందుకు సిద్ధం కావాలని కోరారు. అలాగే వారందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఆధార్ సెంటర్ నిర్వాహకులపై

## చర్యలు తీసుకోవాలి

### -నక్షత్రపు ప్రసాద్



రెంటచింతల మేజర్ న్యూస్ : మాచర్ల : ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆధార్ సెంటర్లలో నిర్దిష్ట ధరలను మించి ప్రజల వద్ద నుంచి డబ్బులు అధికంగావసూలుచేస్తున్న ఆధార్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గం అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం నక్షత్రపు ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో గుర్తింపు పొందిన 3 ఆధార్ సెంటర్లు ఉన్నాయన్నారు. వాటిలో శ్రీశైలం రోడ్డులోని పోస్ట్ ఆఫీస్ లో ఉన్న ఆధార్ సెంటర్ నిర్వాహకుడు నిబంధనలను అధిక్రమించి అదనంగా ఒక్కొక్కరి వద్ద నుండి రూ.100లు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. విషయంపై వివరణ కోరగా అన్ని ఆధార్ సెంటర్లలో అదనంగా వసూలు చేస్తున్నారని అదేవిధంగా తమ కూడా ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆయన ఆవేదం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఆధార్ సెంటర్ లపై సంబంధిత ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.షేక్ అబ్దుల్ షరీఫ్, బార్లపూడి మల్లికార్జునరావు,సంకూరి నరసింహారావు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీ ఆహారమే మీ ఆరోగ్య రహస్యం -కొత్తా విష్ణుప్రియ



నరసరావుపేట మేజర్ న్యూస్ :మన ఆరోగ్యానికి బలమైన పునాది పోషకాహారమే అని ప్రముఖ డైటిస్ట్ కొత్తా విష్ణుప్రియ అన్నారు.శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి, రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి, మానసిక ఉల్లాసాన్ని కలిగించడానికి మరియు దైనందిన శ్రమలకు కావలసిన శక్తిని అందించడానికి సరైన ఆహారం అవసరం అని ఆమె తెలిపారు.పాలు, గింజలు, కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, ప్రోటీన్ పదార్థాలు వంటి పోషక విలువలు ఉన్న ఆహారాలను మన రోజువారీ ఆహారంలో చేర్చాలని ఇందులోని విటమిన్లు, ఖనిజాలు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, ప్రోటీన్లు శరీర పనితీరును మెరుగుపరుస్తాయని అన్నారు.పోషకాహారం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. పోషకాహారం శరీర వృద్ధికి అవసరమైన శక్తిని అందిస్తుంది అనారోగ్యాలనుండి రక్షణ కలుగుతుంది శక్తివంతమైన మెదడును ఏర్పరచుతుంది పిల్లల ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తుందిమానసిక ఉల్లాసం, చురుకుతనం పెరుగుతుంది ఇప్పటి జీవన శైలి, వేగవంతమైన రోజువారీ కార్యకలాపాల మధ్య తినేందుకు తక్కువ సమయాన్ని కేటాయించడం వలన తక్కువ పోషక విలువలు గల ఆహారాలపై ఆధారపడుతున్నారు దీని వలన ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయని వివరించారు.కావున సమతుల్యమైన పోషకాహారాన్ని తీసుకోవడం అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని మన ఆరోగ్యమే మన సంపద అని అన్నారు. రోగాల భారిన పడిన తరువాత వైద్యంకొరకువేల రూపాయలు ఖర్చు పెట్టే పరిస్థితి రాకుండా మనం తీసుకునే ఆహరం ద్వార మందులతో పని లేకుండా సరైన ఆహార నియమాలు పాటించి అధిక బరువు తగ్గి ఎటువంటి రోగాల భారిన పడకుండా ఆరోగ్యకరంగా జీవించవచ్చన్నారు. న్యూ ఢిల్లీలో క్లినిక్ నిర్వహించి డైట్ కౌన్సిలింగ్ తో ఎంతోమందిని ఆరోగ్యకరమైన జీవన శైలి కి మార్చగలిగామని ప్రస్తుతం హైదరాబాద్ లో డైట్ కౌన్సిలింగ్ తో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.ఆరోగ్యకరమైన సమాజమే తన లక్ష్యమని పేర్కొన్నారు.త్వరలో ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు,నరసరావుపేట లాంటి పట్టణాలలో తమ కేవీపీ న్యూట్రిషన్ సెంటర్ ద్వారా అతి తక్కువ ఖర్చు తో డైట్ సేవలు అందిస్తామని వివరాలకు ఈ క్రింది నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు. సెల్ 9160580005....

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నేతలు



నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :నరసరావుపేట మండలం పాలపాడు గ్రామం నందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య పులిమిరామిరెడ్డి మండల నాయకులు పాల్గొన్నారు కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమలను గ్రామ ప్రజలకు వివరించారు గ్రామ ప్రజల వద్ద నుండి గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు పట్టణంలో 17 వ వార్డు వరవకట్ట నందు పట్టణ నాయకుల ఆధ్వర్యంలో సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో నరసరావుపేట పట్టణ నాయకులు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్ట కిరణ్ నరసరావుపేట తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు శేఖర్ పట్టణ వైస్ ప్రెసిడెంట్ కుంచాల బాజీ మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి మైనార్టీ నాయకులు షేక్ మాబు వార్డు ప్రెసిడెంట్ సైదా కరిముల్లా గుగ్గుమ్ వార్డ్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు వార్డులోని ప్రజలందరూ ఉమ్మడి ఎన్డీఏ ప్రభుత్వం చాలా బాగా పనిచేస్తుందని అందులో ఒక ఇంటి మహిళకు నలుగురు పిల్లలకు తల్లికి వందనం పడిందని అదేవిధంగా మహిళల మొత్తము ఆనందంతో ప్రభుత్వం తరపున సంక్షేమ పథకాలు మాకు అందుతున్నాయని చెప్పవచ్చారు వారి సమస్యలు ఏమన్నా ఉంటే వార్డు నాయకులకు సచివాలయం సిబ్బందికి తెలియపరచవలసిందిగా కోరారు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అద్భుతంగా ఉందని ప్రజలు అందరు సంతోషంగా ఉన్నారని కొనియాడారు....

## రోటరీ క్లబ్ 84 వ నూతన కార్యవర్గం

### – ఆర్ట్ ఆఫ్ నటరాజ్ ఫౌండర్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య కళా ప్రదర్శన






గుంటూరు సిటీ మేజర్ న్యూస్ : గుంటూరు రోటరీ క్లబ్ కార్యాలయం నందు 84వ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ట్ ఆఫ్ నటరాజ ఫౌండర్ విజయ గౌరీ హాజరైనారు. ఈ సందర్భంగా విజయ గౌరీ మాట్లాడుతూ రోటరీ క్లబ్ నూతన కార్యవర్గానికి ముందుగా తన అభినందనలు తెలియజేశారు. రోటరీ క్లబ్ వారు సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారని, సమాజంలో నిరుపేద కుటుంబాలకి రోటరీ క్లబ్ ద్వారా వారి యొక్క ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుటకు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అనంతరం ఆర్ట్ ఆఫ్ నటరాజ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో తెలుగుతనం ఉట్టిపడేలాగా చిన్నారుల చేత కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు, నృత్య నిర్వహించిన చిన్నారులు తులసి, కావ్య, నేహా, తేజు, నైమిశా, నందిని, లహరి, కూజిత, బ్రితి తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వాలి: పిడిఎఫ్, రైతు సంఘం



పెదకూరపాడు (మేజర్ న్యూస్ ) :అర్హత కలిగిన కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపచేయాలని పెదకూరపాడు అభివృద్ధి వేదిక (పిడిఎఫ్), రైతు సంఘం ఆధ్వర్యంలో పెదకూరపాడు తహసిల్దార్ ధనలక్ష్మి కి వినతి పత్రం అందజేశారు. సోమవారం ఆయా సంఘాల ప్రతినిధులు ఆమెకు అందజేసి మాట్లాడుతూ ఓసి లోని కౌలు రైతులకు కూడా వర్తింప చేయాలన్నారు. గత ప్రభుత్వం కౌలు రైతులను కులాల వారీగా విభజించి ఓసీలకు ఇవ్వకపోవడం వల్ల అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే విధి విధానాలు ప్రకటించాలన్నారు.

## రోడ్లు, కాల్వల్లో వ్యర్థాలు లేకుండా చూడండి



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం ద్వారా రోడ్లు, కాల్వలలో వ్యర్థాలు లేకుండా చూడవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. సోమవారం సంగడిగుంట, లాంచెస్టర్ రోడ్, ఐపిడీ కాలనీ, గొలుసు కొండలరావు నగర తదితర ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ పారిశుధ్య పనులపై ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ సచివాలయాల వారీగా మైక్రో ప్యాకేట్స్ ప్రాతిపదికన ప్రజారోగ్య కార్మికులు ఇంటింటి చెత్త సేకరణ చేయాలన్నారు. కార్యదర్శులు విధిగా ఉదయం మస్టర్ సమయానికి హాజరై కార్మికుల పనిని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో డంపింగ్ పాయింట్స్ ఉండడానికి వీలు లేదని, త్వరలో ప్రతి ఇంటికి ఆర్ఎఫ్ఐడి ట్యాగ్ లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వార్డ్ ల వారీగా ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి, స్థలాలు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలన్నారు. స్పందించని వారి స్థలాల్లో జీఎంసి బోర్డ్ లను ఏర్పాటు చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ ఆబీద్, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యమే ప్రథమ ప్రాధాన్యం

**గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు, మేజర్ న్యూస్ :** ప్రజారోగ్య భద్రత కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సోమవారం గుంటూరు తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించారు. నగరంలోని 12వ వార్డుకు చెందిన కురంగుంట్ల త్రిలోకేశ్వర్ రెడ్డి కుమార్తె రెండేళ్ల చిన్నారి ధనలక్ష్మి అనారోగ్యానికి గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు కావడంతో అప్పుల్లో కూరుకుపోయారు. ఈ నేపథ్యంలో తమను ఆదుకోవాలంటూ ఎమ్మెల్యే నసీర్ ను తల్లిదండ్రులు సంప్రదించారు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తాము అండగా నిలుస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించి మంజూరయ్యే వరకు స్వయంగా పర్యవేక్షించారు. దీనికి సంబంధించి రూ.2,08,477 విలువైన రిలీఫ్ ఫండ్ నిధులు మంజూరు కావడంతో%ష్ట్ర% బాలిక తల్లిదండ్రులకు చెక్కును ఎమ్మెల్యే నసీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సుమారు రూ. 3 కోట్ల విలువైన సీఎం నిధులు అందించామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నామని, ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.


18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.
ఇట్లు... పి. బాలు ( చిన కొండయ్య )
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777


# 10న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం

**సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలి - అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలో జూలై 10వ తేదీన మెగా టీచర్స్ పేరంట్స్ మీటింగ్ 2.0(ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం) ప్రభుత్వం నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమం నిర్వహించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, కరస్పాడెంట్ లను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ ఆర్ శంకరన్ మినీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ తో కలసి మేగా టీచర్ పేరంట్స్ మీటింగ్ 2.0 నిర్వహణపై విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాడెంట్లు, ప్రిన్సిపల్స్ తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ జూలై 10వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో మెగా టీచర్స్ పేరంట్స్ సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.. సమావేశానికి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానాలు పంపే ప్రక్రియను సోమవారం సాయంత్రం లేదా మంగళవారం మధ్యాహ్నంకు ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. సమావేశం నిర్వహణకు సంబంధించి నిర్దేశించిన విధంగా మినిట్ టూ మినిట్ కార్యక్రమాలు జూలై 10వ తేదీ ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలో నిర్వహించాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి 09.30 గంటల వరకు విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక పెద్దలకు ఆహ్వానం పలకాలన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసి ఫోటో బూత్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రూప్ ఫోటో తీసుకోవటానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఉదయం 09.30 నుంచి 10.30 వరకు తరగతి గదులలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులతో సమావేశమయ్యి హెూలిస్టింగ్ ప్రోగ్రేస్ కార్డులు అందించి, విద్యార్థులు ప్రోగ్రెస్ ను తెలియచేయాలన్నారు. ఉదయం 10.30 నుంచి 11.00 వరకు విద్యార్థుల తల్లులకు మ్యూజిక్ ఛైర్, లెమన్ ఇన్ స్పూన్ , రంగోలి పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలన్నారు. ఉదయం 11.00 గంటల నుంచి మెగా టీచర్ పేరంట్స్ సమావేశాన్ని నిర్వహించాలన్నారు. సమావేశంలో ప్రార్థన గీతం, తల్లికి వందనం కార్యక్రమం ద్వారా విద్యార్థుల తల్లులకు సన్మానం, ప్రధానోపాధ్యాయుల ఫీడ్ బ్యాక్, విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ముఖ్య అతిథులతో ప్రసంగాలు చేయించాలన్నారు. గ్రీన్ పాస్ పోర్టు, మొక్కలు నాటటం ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో సే నో టూ డ్రగ్స్ ప్రతిజ్ఞ , సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. సమావేశం అనంతరం విద్యార్థులకు , తల్లితండ్రులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ఉపాధ్యాయులతో అంతర్గత కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమాల నిర్వహిస్తున్న తీరును పరిశీలించేం దుకు పాఠశాలకు, విద్యాశాఖకు సంబంధం లేని ప్రభుత్వ ఉద్యోగిని ఇండిపెండెంట్ విట్‌నెస్‌గా నియమించుకోవాలన్నారు. ఇండిపెండెంట్ విట్‌నెస్‌గా ఉన్న ఉద్యోగి కార్యక్రమం నిర్వహించిన తీరుపై ఎల్ఈఈఫీ యాప్ లో 30 సెకన్ల నిడివి కలిగిన వీడియో, మూడు ఫోటోలను అప్లోడ్ చేసి, అభిప్రాయాన్ని నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ, ప్రవేటు విద్యాసంస్థలు కార్యక్రమ నిర్వహణపై విద్యాశాఖ అధికారులను సమన్వయం చేసుకొని సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఈఓ రేణుకా, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించండి

**జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశం**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని, ఎలాంటి సందర్భంలో కూడా బియండ్ ఎస్ ఎల్ ఏలోకి వెళ్లకుండ చూడాలని విధులలో నిర్లక్ష్యంగా ఉండేవారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.బార్గవ్ తేజ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మికుమారి, ఎస్.సి.కార్పొరేషన్ ఇ.డి. శ్రీనివాస్, డి.ఆర్.ఓ ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు ప్రజల నుండి 259 పిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో జిల్లా కలెక్టరు ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన పిటిషన్లను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. మరో 24 గంటల్లో గడువు ముగిసే పిటిషన్లు బియండ్ ఎస్ ఎల్ ఏ లోకి వెళ్ళకుండా ముందుగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో వింజనంపాడు, లాల్ పురం, కంతేరులోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లకు వచ్చిన అర్జీలు బియండ్ ఎస్ ఎల్ ఏలోకి వెళ్ళాయని వాటిపై వివరణ కోరుతూ సంబంధిత మండల అధికారులకు షోకాజ్ నోటీస్ లు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పి.జి.ఆర్.ఎస్. నిర్వహణకు సంబంధించి అర్జీదారుని పిర్యాదును సరిగా ఎండార్స్ చేయడం లేదని, సంబంధిత శాఖలో సరైన అధికారికి పంపడం లేదని పై అధికారులు తనిఖీలు నిర్వహించకుండా క్రింది స్థాయి అధికారుల స్థాయిలోనే పరిష్కరించడం జరుగుతుందని, గ్రీవెన్స్ రెడ్రసల్ అధికారులే సమస్యను పరిష్కరించాలన్నారు. జిల్లాలో వచ్చిన దరఖాస్తులే మళ్ళీ మళ్ళీ వస్తున్నాయని అలా రాకుండా అర్జీదారుని సమస్యను పూర్తిగా పరిష్కరించి తిరిగి అదే సమస్య పై అర్జీ దాఖలు కాకుండా చూడాలన్నారు. ప్రజలలో సంతృప్తి స్థాయి శాతం తగ్గుతుందని, ప్రజలలో సంతృప్తి స్థాయిని పెంచేలా అధికారులు కృషి చేయాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి నిర్ణీత సమయంలో కౌంటర్ దాఖలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఇఓజ్యోతిబాసు, పిడి హౌసింగ్ , డి.ఆర్.డి.ఏ. ప్రసాద్, విజయలక్ష్మి, సి.పి.ఓ. శేషశ్రీ, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఉద్యానవన శాఖ అధికారి రవీంద్ర బాబు, డి.ఎఫ్.ఓ హిమ శైలజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర రావు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, డి.ఎం.అండ్. హెచ్.ఓ., డాక్టర్ విజయలక్ష్మి, ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏ.డి.పవన్ కుమార్, డి.డి అడల్డ్ ఎడ్యుకేషన్ ఆంజనేయులు, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్స్ స్కూల్స్ ప్రిన్సిపాల్ ఆనందబాబు పాల్గొన్నారు